రుద్రభూమి

"నేను నా చిన్నతనంలో మా తాతగారితో కలిసి స్మశానానికి వెళ్ళాను. నేను తిరిగి వచ్చేశాను. ఆయన అక్కడే ఉండిపోయాడు" అన్నాడట ఒక కవిసత్తముడు.

మా తాతగారు నేను పుట్టకమునుపే వల్లకాటికి వేంచేశారు. అందువల్ల ఆయనద్వారా నాకు స్మశాన సందర్శన భాగ్యం లభించే అవకాశం లేకపోయింది. నేను రుద్రభూమి కెళ్ళింది కన్నారావుతో కలసి.

కన్నారావుని నేను నా మిత్రుడని చెప్పుకోను. ఎందుకంటే నాపట్ల అతడికున్నది గురుభావం. "నేను మీ శిష్యుడివంటివాణ్ణి స్వామీ," అని అతడే నాతో ఎన్నోసార్లు అని ఉన్నాడు. కానీ చూస్తూ చూస్తూ అంతటి భారీసైజు మనిషిని నా శిష్యుడని ఎలా చెప్పుకోగలను? అందుకు తగిన యూనిఫారం దుస్తులు తొడిగి వదిలిపెడితే అసలు సిసలు డి.ఎస్.పి లా ఉంటాడు కన్నారావు. ఆకారపుష్టిలో మాత్రమే కాదు. ఆర్థిక సౌష్టవం రీత్యాగూడా అతడే విశిష్టుడు. టౌనులో అతడికి మూడిండ్లున్నాయి. పది రిక్షాబళ్ళు అద్దెకు తిరుగుతున్నాయి. ఎక్కడో పల్లెలో ఉన్న పొలాలపైన వచ్చే గింజలు అతనికి భోజనానికి సరిపోతాయి. పెట్టి పుట్టిన అదృష్టంలోనూ, డబ్బులు సంపాదించడంలోనూ, సుఖంగా మనగలగడంలోనూ నిస్సందేహంగా గురుత్వం అతడిదే! ఎటొచ్చీ నేను అంతో యింతో వ్రాతగాణ్ణి. అప్పటి కదేదో అతి మానుషమయిన పనైనట్టు నేను కనిపించినపుడల్లా "మేష్టరుగారూ! సునాయాసంగా ఎలా వ్రాసి పడేస్తారండీ!" అంటూ ఆశ్చర్యపడుతుంటాడు కన్నారావు. ఒకసారి "అదెంత పనిలేవోయ్ కన్నారావ్! వ్రాయగలిగిన పేనా ఒకటి చేతిలో ఉండాలి. అందులో సిరా ఉండాలి. ఎవరైనా రాసి పారెయ్యొచ్చు" అన్నాను. "ఏం మాటలెండి! ట్రై చేసి చూసి ఉండకపోతే నేనూ అలాగే అనుకునేవాణ్ణి. తిండిపోతు సుబ్బారాయుడు లేడటండీ! వాణ్ణి గురించి మీకు తెలిసే ఉండాలి. పాపిష్టి ముండావాడు, ఎరువులన్నీ బ్లాకులో తగలేశాడా, చక్కెరబస్తాలను గిడ్డంగి దగ్గరే మారుబేరానికి అమ్మేశాడా. ఆ మధ్య ఆటోరిక్షాలుకొని సైకిలురిక్షావాళ్ళ నోళ్ళల్లో దుమ్ముగొట్టటానికి గూడా జూచాడు. వాడిపైన ఓ కరపత్రం వేయాల్సి వచ్చింది. తెల్లవారు జామున మూడు గంటలవరకు ప్రయత్నించాననుకోండి. ఒక గీత ముందుకు సాగితే ఒట్టు... ..."

చచ్చానురా బాబో అనుకున్నాను. ఈ కన్నారావు కరపత్రాలు, ఆకాశరామన్న ఉత్తరాలు మొదలయినవి రాసేవాళ్లకున్నూ, కథలు, నవలలు మొదలైనవి వ్రాసే వాళ్ళకున్నూ స్వభావంలో తేడా ఏ మాత్రముండదన్నట్టు భావిస్తున్నట్టున్నాడు!

"ఏదైనా వ్రాయాలంటే దండిగా చదవాలోయ్ కన్నారావు" అనేవాణ్ణి.

"అబ్బో! అబ్బో నేను చదవని పుస్తకాలా! రుద్రయ్య అంగడంతా ఖాళీ చేసేశానే అనేవాడు కన్నారావు,

"ఏదీ! మరైతే మీ యింట్లో పుస్తకమన్న వస్తువు ఎక్కడా కనిపించదే!" మొదటిసారిగా ఆ మాట విన్నప్పుడు విస్తుపోతూ అడిగాను.

"అబ్బే, అవన్నీ తెచ్చి ఇంట్లో ఎక్కడ పెట్టుకుంటామండీ! అదేమైనా అయ్యేపనా పొయ్యేపనా! చదవడమూ, యిచ్చెయ్యడమే! రోజుకొకటి చొప్పున తెచ్చుకుంటూ ఉంటాను..."

'అయ్యో కన్నారావు,' అనుకుంటూ మనసులోనే జాలిపడి "ఐతే దాన్ని అంగడన కూడదమ్మా! లైబ్రరీ అనాలి" అంటూ సవరించాను.

కన్నారావు ఒక్క పెట్టున నవ్వేశాడు – "ఊఁహూ, రుద్రయ్య దగ్గర ఆ పప్పులేమీ ఉడకవండోయ్ గురువుగారూ! ఉచితంగా మీకు పుస్తకాలిస్తే యిక రుద్రయ్య బట్ట తడిపి కడుపుపైన వేసుకోవలసిందే! చెవులు నులిమి ముందుగా అద్దె డబ్బులు వసూలు చేసుకొని, ఆ తరువాత అతడు పుస్తకం చేతికిస్తా...డు..."

నేను పల్లెటూరివాణ్ణి. అడపా దడపా ఎప్పుడో పట్టణానికి వెళ్తుంటాను. పట్టణంలోవున్న నాలుగైదు పుస్తకాల షాపులూ నాకు చిరపరిచితమే. కానీ ఈ రుద్రయ్య ఎవడో, అతడి పుస్తకాల దుకాణం ఎక్కడున్నదో నాకు తెలియదు. ఎప్పుడయినా తీరిక దొరికినప్పుడు అక్కడికి వెళ్ళాలని అనుకుంటూ ఉండేవాణ్ణి, ఎవరు చూచారు ఏ పుట్టలో ఏ పాములైనా వుండొచ్చు.

నాలోని రచయితపట్ల కన్నారావుకు తిరుగులేని గురి ఏర్పడి వుండడానికి కారణముంది చూచారా, అది చాలా విచిత్రమయినదేనని చెప్పాలి. ఇరవై ఏళ్ళ క్రితం లోకానికి నా కళ్ళు విచ్చుకుంటూ, విచ్చుకుంటూ ఉన్న రోజుల్లో నేనొక నాటకం వ్రాశాను. తరువాతి కాలంలో అలాంటి నాటకం వ్రాసినందుకు సిగ్గుపడ్డాననుకోండి! ఆ విషయం ఇక్కడ అప్రస్తుతం. కన్నారావు ఆ నాటకంలో ఓ చిన్న వేషం వేశాడు. ఆ పాత్రకున్న ఒకటి రెండు పవర్‌ఫుల్ డైలాగ్సునూ మోతగా ఒప్పజెప్పి కరతాళధ్వనులు పుచ్చుకున్నాడు. ఆ క్షణంనుంచీ నేనొక మహారచయితనన్న విశ్వాసం అతడి రక్తంలో జీర్ణించి పోయింది. అంతకుమించి యిటీవలి కాలంలో పత్రికల్లో పడ్డ రచనల్నిగానీ అచ్చయిన పుస్తకాల్నిగానీ అతడు చూచిన పాపాన పోయినట్టు లేదు.

ఎప్పుడెదురైనా కుశల ప్రశ్నలు పూర్తికాగానే అతడు తప్పనిసరిగా అడిగే ప్రశ్న : "గురువుగారూ! మీరింకా ఆ యింట్లోనే అద్దెకున్నారా?"

"అదే యిల్లు. అదే సంపాదన, అదే సంసారం. మార్పే లేదు" అంటాను.

కన్నారావు నొచ్చుకుంటాడు. "ఇది పనిగాదండి గురువుగారూ! మీరేం లాభం లేదండి! మీకంటే ఒక తరం వెనకాల పుట్టిన రైటర్లు ఎలా బ్రతుకుతున్నారో తెలుసా మీకు? ఒకాయన కాపురం మూడంతస్తుల మేడ లోనట! ఇంకోకాయన కార్లల్లోగానీ నేలపైన తిరగడట... ..."

బహుశా వాళ్ళెవరో సినిమాలకు వ్రాసేవాళ్ళయి వుండాలి. లేదా తెలుగు తప్పించి మరో భాషలోనైనా వ్రాస్తూ వుండాలి. ఆ వివరాల జోలికి వెళ్ళాలన్న ఆసక్తి నాకు లేదు. అందువల్ల " ఆ విశేషాలన్నీ నీకెవరు చెప్పారు బాబూ?" అన్నాను.

"రుద్రయ్య చెప్పాడు లెండి! అతడికీ విషయాలన్నీ కొట్టిన పిండి."

"అలాగా! ఆ రుద్రయ్య నొకసారి చూచినా బాగుండిపోవును." అంటూ చిరకాల వాంఛను మళ్ళీ ఒకసారి బయటపెట్టాను.

"ఎప్పుడో ఎందుకూ? ఇప్పుడే వెళదాం పదండి!"

నేను రుద్రయ్య షాపుకెళ్ళడం అలా కుదిరింది. ఇదివరకు నేనెన్నోసార్లు బలాదూర్లు తిరిగిన మెయిన్ బజారులోనే వుంది రుద్రయ్య షాపు. కానీ, తీరా కన్నారావు తీసుకొచ్చి వదిలేదాకా అక్కడ ఇలాంటి షాపు ఒకటి ఉన్నట్టు తెలియకపోవటమే విచిత్రం. ఆ కొట్టు చాలా యిరుకుగా ఒక గొందిలా ఉండడమే యిందుకు కారణం గావచ్చు. పైపెచ్చు రుద్రయ్య తన పుస్తకాల వ్యాసంగం లోకులకందరికీ తెలియవలసిన అవసరం లేదనుకున్నాడేమో, కొట్టుకడ్డంగా ఒక గోనెపట్ట తెరకట్టాడు. తెరతొలిగిస్తే కొట్టు ఒక పాతాళ బిలంలా కనిపిస్తుంది. సంతలో టోకుగా కూరగాయలు కొని, లూజుగా లారీలోపోసి తరువాత యిచ్చవచ్చినట్టుగా బుట్టలకెత్తినట్టు, సైజు, సబ్జక్టు అన్న పట్టింపులేకుండా అక్కడ పుస్తకాలు స్టాండులో గుప్పబడి యున్నాయి. పుస్తకాలు పాతగిల్లినకొద్దీ అదొకరకం వాసన పుట్టుకొస్తుంది. అలాంటి వాసనతో అదొక చిన్న గిడ్డంగిలా వుంది.

"పిల్చుకొచ్చేశానోయ్! రుద్రయ్యా! చెబుతుండే వాణ్ణిగా, వీరే గురువుగారు......" అంటూ పేరుతో సహా నన్ను పరిచయం చేసిపెట్టాడు కన్నారావు.

"అలాగా! రండిసార్! కూచోండి" అంటూ వినయంగా లోపలికి ఆహ్వానించాడు రుద్రయ్య.

కూచోమన్నాడేగానీ పుస్తకాల స్టాండుల మధ్య గనుక నేను కుర్చీ వేసుకుని కూచుంటే! తరువాత లోపలికి, బయటకి రాకపోకలు బంద్దైపోయేటట్టున్నాయి. అంచేత నిల్చునే చేతికి దొరికిన పుస్తకాన్ని పైకితీసి చూడసాగాను.

కాఫీ గ్లాసుతో దగ్గరి కొచ్చేశాడు రుద్రయ్య. "పుస్తకాలు చూస్తున్నారా సార్! చూడండి. మీకు పనికొచ్చేవి గూడా ఉండొచ్చు. సార్! నిజం చెబుతున్నాను సార్! మీకు చాలా పేరుంది. పుస్తకాల కొనుగోలుకు వెళ్ళినప్పుడల్లా అక్కడివాళ్ళు మిమ్మల్ని గురించి అడగటమే. గంటా గవర్రాజని ఓ పబ్లిషరున్నాడు సార్! అతడి టర్నోవరు లక్షల్లో వుంటుంది లెండి. అతడైతే ఎలాగైనా పుస్తకం వ్రాయించి పెట్టమని సతపోరు పెడుతున్నాడు సార్!"

"ఏదీ! ఆ గంటా గవర్రాజు పుస్తకాలిక్కడున్నాయా?" అన్నాను.

"అదిగో ఆ రెండు వరసల నిండుకూ అవే! అంతా వందల లెక్కలోనే కొనుగోలు! మాకు వంద డెబ్బయి అయిదు పడుతుంది. మేం డజనుకు పదిహేను గిట్టుబాటు అయ్యేట్టుగా అమ్ముతుంటాం."

"మరైతే ఈ పుస్తకం మీది రేటుకూ, మీ హోల్ సేల్, రీటయిల్ రేట్లకూ సంబంధం వున్నట్టు లేదే!" అన్నాను.

"ఇ హి హీ" అన్నాడు రుద్రయ్య "ఈ వ్యాపారంలో చాలా లొసుగులున్నాయి లెండి గురువుగారో! అదిగో ఆ అటక మీద వున్న పుస్తకాలనైతే మేము వీశలలెక్కలో కొంటాం. పోనీ యివి చూడండి. లైబ్రరీ ఎడిషన్లకంటే అందంగా లేవూ! ఇది నాకు అరవై పర్సెంటు కమీషను పైన దొరికాయి......"

పాత పుస్తకాల వాసన. కాఫీ ప్రభావం, రుద్రయ్య చెప్పిన వివరం ఈ మూడింట్లో ఏది కారణమో చెప్పలేను. నాకు స్వల్పంగా తల తిరుగుతున్నట్లుంది.

కామినీ, శాకినీ, ఢాకినీ, పిశాచాల గురించి నేను విని వున్నాను. ప్రత్యక్షంగానే చూచే అవకాశం రుద్రయ్య కొట్టులోనే లభించింది. ఏం లేదు ఓ పుస్తకం తియ్యి, ముఖపత్రం వైపు చూడు. కామినీ పిశాచం వచ్చి నీ కనుపాపల్లో నిలుస్తుంది. "నన్ను చూడు, నా అందంచూడు" అన్నట్టుగా ఓ మోహినీ పిశాచం బట్టలు విప్పుకొని పైకి వచ్చేస్తున్నట్టే వుంటుంది. తలలు విరబోసుకున్న జీబు దయ్యాలు, బట్టలో ఒళ్ళు దాచుకుని, మిట్టపళ్ళు మాత్రం ముందుకు చాపే ముసుగు దయ్యాలు, తలపుర్రెలు, కంకాళాలు, నెత్తురు మడుగులో శవాలు, పెట్టెతియ్యి, శవం, గదిలో ప్రవేశించు, శవం.

చేసిన పాపం చెప్పుకుంటే పోతుందంటారు. నేనొకటి రెండు పుస్తకాలు తెరిచి అడుగు పెట్టరాని చోట్లల్లో అడుగు పెట్టాను.

రాక్షసరతులు, సమిష్టి సంభోగాలు, ఏకలింగ మైధునాలు, తిండీ, నీళ్ళూ, బ్రతుకూ, పరమార్థమూ అంతా అదే అయినట్లుగా స్త్రీ పురుషులు కుక్కల్లా పందుల్లా వ్యవహరించే వల్లకాటి నాగరికత, అంతా అక్కడే ఉంది. భగవంతుడా! నాకిప్పుడు కాళ్ళు కంపించి పోతున్నాయి. ఒళ్ళంతా చెమటలు పోశాయి. కళ్ళు గిర్రున తిరుగుతున్నాయి. ఉన్నట్టుండి శవాల జాతరలో పీనుగుల కుంభమేలాలో, ఆటవిక దిగంబరుల పాశవిక ప్రవృత్తుల నడుమ నేను చిక్కుపడిపోయాను.

అప్పటికి తనకు కావలసిన పుస్తకం ఒకటి ఎన్నిక చేసినట్టున్నాడు కన్నారావు. వీరబాహుడి దగ్గిర కాటిసుంకం చెల్లిస్తున్నాడు.

"ఇక వెళదామా కన్నారావ్!" అన్నాను.

నామాట ఆక్రోశంలా వినిపించిందేమో! రుద్రయ్య వులికిపడ్డాడు.

"గురువుగారూ! ఇక్కడ కొన్ని పుస్తకాలుండాలి. చూచారా?" అంటూ పరుగెత్తు కొచ్చాడు.

నిజమే! అవి చాలా మంచి పుస్తకాలు. ఏ పబ్లిక్ లైబ్రరీలోనో ఉంచతగినవి. ఏ సాహిత్యాభిమాని పుస్తక సంచయంలోనో తావుచేసుకోవలసినవి. పాపం. అకాల మరణం పొంది యిక్కడికి వచ్చినట్టున్నాయి.

"వెళదామా?" అన్నాడు కన్నారావు. అప్పటికి నేను మెట్లుదిగి రోడ్డుపైన ఉన్నాను.

పదిబారల దూరం నడిచాక రహస్యంగా నాతో అన్నాడు కన్నారావు- "మేష్టరుగారూ! కొట్టుక్రింద నేల మాళిగ లాంటిదొకటుంది. దానినిండా పుస్తకాలే వున్నాయి. రుద్రయ్య ఎంతో నమ్మకమయిన వాళ్ళకుగానీ వాటిని చూపించడు. మీకైతే అభ్యంతర ముండదనుకుంటాను. చూస్తారా ఒకసారి..."

"ఓహో! సుప్తాస్తి కలదన్నమాట! వద్దులే కన్నారావ్! వాటిని నిద్రలేపొద్దు. అవతల నాకింకొక అరగంటలో బస్సుంది."

అంటూ పరుగందుకొన్నాను-

❖ పుస్తక ప్రపంచం. ❖